ఎంతమంది సుబ్బారావుల్లేరు? ఎంతమంది సత్యనారాయణలు లేరు ఆంధ్రదేశంలో - ఈ మామిడిపళ్ళ సీజన్లో పెళ్ళిళ్లసీజను కలిసివస్తే అందరిళ్ళల్లోనూ పెళ్ళిళ్లే గదా!

ఈ రిక్షావాడు మీరు చెప్పిన అడ్రసుకు తీసు కెళ్లి ఇదేసుబ్బారావుగారిల్లు, గవర్నరుపేట సింహాల మేడదగ్గిర అని మా అన్నయ్యను దిగబెట్టాట్ట. అప్పటికి పెళ్లి తలంబ్రాలూ, చదివింపులూ దగ్గర వుందట. మీకు తెలుసుగా మా అన్నయ్య వట్టి కంగారు మనిషని-ఆ ప్రయిజూ, వెండి కప్పూ-సాసరూ చదివించే ఆయన దగ్గర వుంచి చందన తాంబూలాదులు అందుకుని ఇటూ అటూ చూస్తున్నాడట. ఇంతలో కాఫీ ఫలహారాలకు, అట్నుంచటే అర్జంటు అతిథులకు భోజనాల ఏర్పాటు జరిగే పందిట్లోకి లాక్కుపోయారట. మీకు తెలుసుగా మా అన్నయ్యకు "పేకాట" చిన్న వీక్నెసు అనీ. ఆ ఫలహారాలూ, విందులూ, అయాక పెళ్ళివారి విడిదిలో "పేకాట"కు కూర్చున్నాట్ట.

ఇంతలో పెళ్లి కొడుకూ - పెళ్ళి కూతురూ పాదాభివందనం చేయడానికి వచ్చారుట.

అప్పుడు మా అన్నయ్యకు ముచ్చెమటలు పోసేశాయి. గుడ్లు మీదకు వెళ్ళిపోయాయి. పేకాటలోంచి లేచి ముక్కలు పక్కన కూర్చున్న వాడి చేతిలో పెట్టి తువ్వాలుమీద డబ్బుల్నేనా ఏరుకోకుండా తెలిసిన కాకినాడ వంట బ్రాహ్మలని శరణుజొచ్చి, ఆ హోల్డాలు, సూటుకేసూ బైట పెట్టించుగుని - ఆ రాత్రి చీకట్లోతిరిగి కంటికి కనిపించకుండా వనములను దాటి వెన్నెల బయలుదాటి, విపినములుదాటి దుర్గమాద్రులను దాటి అన్నట్లు ప్రాణాలతో స్టేషనుకొచ్చి పడి రాజమండ్రి టిక్కెట్టుచ్చుగున్నాట్ట- ఆ వెండికప్పు సాసరూ పెళ్ళికూతురికి ప్రాప్తం. అది సరే లెండి గాని, సుబ్బారావుగారి ఇల్లంటే రిక్షావాడికి మీరు ఇలాగేనా అడ్రసు ఇవ్వడం?

అందుకనే మా అన్నయ్య వాళ్ళు మిమ్మల్ని జెంటిల్మాను, అనుకోవడంలేదు పై పెచ్చు మీరు ఆజోకును బ్రహ్మాండంగా పెళ్ళి పందిట్లో సర్వులకీ చెప్పడం మా అన్నయ్య "మిష్టర్ మార్క్"కి పుండుమీద కారంజల్లినట్లుగా వుండమంటే ఉండదూ

అందుకనే కోనసీమ పెళ్ళికి వెళ్తే మీ కెంత గౌరవం ఇవ్వాలో అంతా నాకూ ఇచ్చారు.

పెళ్ళి శుభలేఖ సరిగా చూడకుండా ఇంకెవరికీ అటువంటి ఉచిత సలహాలూ అడ్రసులూ ఇవ్వకండి. ఇవ్వనని ఒట్టేయండి!

# మరపురాని బాధకన్నా మధురమే లేదు!

మన జీవితంలో విషాదాన్ని సూచించే స్వగతాలే మధుర మైనవి. ఢిల్లీలో ఓసారి రేడియో వారు ఎందుకోగాని మిమ్మల్ని పిలిచారు. మీ స్నేహితులువచ్చి ఎంతో బలవంతం చేసి గుచ్చిగుచ్చి అడిగితే "తొడుక్కోడానికి మంచిచొక్కా లేదని మీరు రాలేనన్నారు". ఆముక్క మీరుచెబుతుంటే నేను కిటికీ తలుపు చెక్కకు తల బాదుకుని ఏడ్చాను.

నామొగుడిది దమ్మిడీ ఉద్యోగం, నాది అణాకానీ సంసారం కనుక ఢిల్లీలో ఉన్న అయిదేళ్ళూ మీ చేతి ఉంగరం, నా మెళ్లో గొలుసూ, మీకు పెళ్ళికి పెట్టిన నూరు తులాల వెండి కంచం. చాందినీ చౌకులోని గుజరాతీ షావుకారు కొట్లో తాకట్లో వుండేవి. కాలంకరుస్తుంది. ఎంత త్రోసినా నడవనంటుంది. ఎదురు తిరుగుతుంది. తలవంచుకుని అగ్ని పరీక్షలకు నిలబడటం కన్న మనమేమిచేయగలం?

ఒకమారు ఏదో పుస్తకం రాస్తే డబ్బొచ్చిందని ఖద్దరు సిల్కు చొక్కా, పేవుమెంటు మీద అమ్మే రెండు సాక్సులూ - నాకొక గళ్ళ గళ్ళ నేత చీర పట్టుకొచ్చారు. మీరనుకున్న పది పన్నెండు రూపాయల ధరలో దొరికింది. అదీగాక నీలంరంగుమీద నలుపుగళ్ళ నేత చీర మీకెంతో నచ్చింది. అది ఒకసారి కాబోలు మడత తీసికట్టుకుని “లూ”గారింటికెళ్ళాను. తరువాత తడిపి కొత్తచీరను ఫెన్సింగు మీద ఆరేస్తే దూడ వచ్చి కసితీరా నమిలి తినేసింది. అదినాకున్న ఒకటే మంచి చీరె అని దూడకెలా తెలిసిందో? నేనేమో నెలలు నిండి కూర్చుంటే లేవలేను. లేస్తే కూర్చోలేను. ఆరాత్రి నేను వెక్కి వెక్కి ఏడుస్తుంటే ఆ దూడకు సైతం నీకున్నదొకటే చీరని ఎలా తెలిసింది అంటూ నవ్వేరు. మీరు నవ్వుతుంటే నాకు చాలా భయం వేసింది.

నులక మంచాలు వేసుకుని వరుసగా దొడ్లో పడుకుంటే రాత్రిళ్ళు పదిగంటల వేళ ఐస్‌లో వేసి తెచ్చిన చెఱకు ముక్కలు తింటూ కబుర్లు చెప్పుకునే వాళ్ళం గుర్తుందీ?

ఒక అర్ధరాత్రి మిమ్మల్ని నిద్రలేపి చెప్పాను. మీరు కంగారుగా వెళ్ళి మంత్రసానిని పిలుచుకొచ్చారు. పురుడు సరిగారాలేదు. నావల్లకాదండి అంది మిడ్‌వైఫ్. అప్పుడు టాక్సీమీద నన్ను వెనకసీట్లో పడేసిమీరూ, మన ఇంటివాడు సర్దార్జీ, లేడి హార్డింజి ఆసుపత్రికి చేర్చారు. అప్పుడు నేను స్వర్గనరకాలమధ్య వున్నాను. నన్ను స్ట్రెచర్ మీద పడుకోబెట్టి లేబర్ రూంలోకి తీసుకెళ్తుంటే మీ చేయి గట్టిగా నొక్కి మీవద్దనుంచి సెలవు తీసుకున్నాను. ఆ పుట్టినబిడ్డను వాళ్ళు నాకు చూపించలేదు. నన్ను ఆసుపత్రి వరండాలో నేలమీద పక్కవేసి పడుకోబెట్టారు. పెసరపప్పు, రొట్టేయించి తినమన్నారు. నాచీరలాక్కుని నాకు ఆసుపత్రి చొక్కా పరికిణి కట్టారు. జైల్లో దొంగలకు వేసే డ్రస్సులో వున్నట్లున్న నన్ను చూచి మీరు చాలా బాధపడ్డారు. నా బిడ్డ ఏమయింది. - నాకు చూపించరు దేనికి అంటే ఎవరూ చెప్పలేదు. మృతశిశువు - మగపిల్లవాడే అన్నారు. పోనీనాకు చూపించండి అని అడిగాను. నాకు చూపించకుండా మీకు ఆ బిడ్డను రంగు కాగితంలో చుట్టిచ్చారు. ఇవ్వడం నాకు కనబడింది. ఆనెత్తురు గుడ్డును నల్లటి జుత్తును నేను వూహించుకున్నాను. మీరు మృత శిశువును ఏం చెయ్యాలో తెలీక తువ్వాలులో కూరల సంచిలా మూటకట్టి ఎవరికీ అనుమానం కలుగకుండా టాంగాలో కూర్చుని యమునానదీ సైకత సీమల్ను చేరుకుని స్వయంగా నది ఒడ్డున గోయితీసి ఆమూట నందులో దింపి మన్ను కప్పి ఇంటికి వచ్చారుట:

ఆ మూటను అలా నలిపికట్టి ముద్దగా ఇసకలో కప్పెట్టేసే ధైర్యం మీకెలా వచ్చింది? నా బిడ్డను నవమాసాలూ మోసిన నాకు చూపించకుండా పారేసి వస్తారా? చావలేదేమో...

చావకుండానే మీరంతా పొరబడి పారేసి వచ్చారేమో నని నాకు మనసు పీకుతూ వుండేది. పోనీ – ఆ ఇసుకలో పడేసేముందు ఒక్కసారి ఆ పిల్లాడి ముఖం చూశారూ? పోన్లెండి – నావస్తువును నాకు చూపించకుండా పారేసినందుకు మిమ్మల్ని నేను క్షమించలేను. ఆవేళ నేను బ్రతికి ఇంటికి వస్తానని అనుకోలేదు. అందుకే అంత త్వరపడి సెలవు తీసుకున్నాను.

ఈ కష్టాలు వచ్చి మనలను మరీ సన్నిహితులను చేసి పారేశాయి, నూట యాభై రూపాయల జీతంతో ఇద్దరు పిల్లలతో ఒంటిగదిలో కాపురం చేసే మనకు నెలనెలా సంసారం వెళ్ళదీసేటప్పటికి పరశురామా లైన్ సర్కస్ అయేది.

ఒకనెల ఎవరితోనో వెళ్ళి పచారీకొట్లో అరువుసంపాదించాను. దినవెచ్చాలు, బొగ్గులు అన్నీ నేనే తెచ్చుకునేదాన్ని, ఆ కొట్లో తొంభయ్యో వందో అయింది ఓ నెల. మిగిలిన యాభై రూపాయలూ పట్టికెళ్ళి ఇస్తేతీసుకుని బ్యాలెన్సు అట్టే పెట్టినందుకు సరుకులకి తర్వాత రమ్మనమని తేలిగ్గా మాట్లాడాడు. నేను సామానులు ఇమ్మని బ్రతిమాలినా వాడువినలేదు. వట్టిచేతులతో పిల్లల్ని వేసుకుని కొట్టునుంచి తిరిగి వస్తుంటే లాంతరు స్తంభం దగ్గర ఆపుకోలేనంత దుఃఖం వచ్చింది. స్తంభానికి చేరగిలబడి ఏడ్చాను. మీరూ నేనూ ఏరైలుకిందో తల పెట్టేస్తే సరిపోతుంది. ఇంత అవమానకరంగా జీవించడంకంటే అని ఆవేళ నా కనిపించింది. నేనింటికి వచ్చి మిమ్మల్ని వెళ్ళమన్నాను. మీరు వెళ్ళి మరో కొట్లో అరువుపెట్టి సరుకులు తెచ్చారు. అక్కడ మనకు మూడు బట్టల కొట్లలో అరువులుండేవి. అందరూ ఇళ్ళకొచ్చి అన్నీ ఇచ్చి వెళ్ళేవారు. ఇంటినంబరు ఇస్తే చాలు ఏనుగునైనా ఫస్టుతారీకున ఇస్తామంటే తెచ్చి ఇంట్లోపడేసేవారు. కానీ ప్రతి ఫస్టు తారీకుకి వెండి గ్లాసో, వెండికంచమో, పాపగొలుసో, ఇంట్లోంచి రెక్కలొచ్చి ఎగిరిపోతుండేవి.

అటువంటి దుర్భర దారిద్ర్యంలోనూ మీరూ, మీస్నేహితులూ నాటకాలు తిరుగుళ్ళూ మానలేదు కదా?

మీరెప్పుడూ సంతోషంగా, సరదాగా కబుర్లు చెబుతూ పరమశివునిలా హాలహలాన్ని గొంతుకలో దిగ మ్రింగినట్లు సంచరించేవారు. ప్యాసులు ఎంత ఫ్రీగా వున్నా ప్రయాణాలకు డబ్బులుండేవికావు. ఒకసారి ఐదురూపాయలు చే బదులు తీసుకొని మీ అమ్మగారికి జబ్బుగా వుందని వైరు వస్తే అత్తయ్యను చూడటానికి బెజవాడ బయలు దేరాము. బెజవాడ స్టేషన్లో దిగగానే మీ జేబులో అణాడబ్బులుకూడా లేవు. మీకు గొప్ప ధైర్యం పెట్టాడు భగవంతుడు – అల్లా కులాసా కబుర్లు చెబుతూ నవ్వుతూ నవ్విస్తూ అగ్నిపర్వతాలు బ్రద్దలవుతూంటే మధ్య నుంచి పెళ్ళాం పిల్లల్ని నడిపించుకు తీసికెళ్లి పోతారు మీరు? ఇదేమిటంటే – "లక్షాధి కారైన-లవణ మన్నమె కాని మెరుగు బంగారంబు మ్రింగ బోడు" అని మెట్టవేదాంతం చెబుతారు. నగలు చేయించమంటే సినిమా కెళ్దామంటారు. సినిమా అంటే షైరు వెళ్దామంటారు. ఎక్కడికేనా వెళ్దామండీ అంటే పకోడీలు వండమంటారు. పకోడీలు వేస్తూంటే పీటమీద కూర్చుని ఉత్తుత్తి కబుర్లు చెబుతూ పిల్లలతో ఆడుకోవడం సరదా!

బైట వర్షంపడుతోందో లేదో చేతులుసాచి చూస్తూ పిల్లలకు కాగితపు పడవలు, స్టీమర్లు, కత్తిపడవలు చేసి పెడ్తూంటే అప్పుడు ఈ అరువియ్యని షావుకార్లు, దూడనమిలేసిన చీర, రేడియోకి వెళ్ళడానికి చొక్కా లేకపోవడం, ఐదురూపాయలతో ఆలిండియా ప్రయాణం పెట్టుకోవడం యివేమీ జ్ఞాపకంరావు.

మన జీవితం ఎవడో తెలివితక్కువ నాటక రచయిత రాసిన అవక తవక నాటకం కాదుగదా అని అప్పుడప్పుడు నా కనిపిస్తోవుంటుంది.

# పెసరట్టు ప్రేమకథ

తింటే పెసరట్టు తినాలి. రాస్తే ప్రేమకథ రాయాలి.

పెసరట్టు వేయడమా, ప్రేమకథ రాయడమా?

ఏమండోయ్ శ్రీవారూ?

ఒక చిన్నమాట-

పురుషుల హృదయాలకు అడ్డరోడ్డు స్టెయిన్ లెస్‌స్టీల్ టిఫిన్ కారీయరు ద్వారా అని విన్నాను.

స్వెట్టరు అల్లుకోవడమా - సీరియల్ నవల వ్రాయడమా?

కొబ్బరికాయ పచ్చడి ముందా -

కొత్త కథకి ప్లాటుముందా?

ఏదీ తెగడం లేదు. ప్రతిష్టంభన... సమస్యలు తోరణాలుగా కట్టి జీవితం వాకిట్లో గుమ్మానికి వ్రేలాడ దీశాము.

అబ్బ; తలనొప్పి... ఉష్;

ఈ పచ్చడి రుబ్బడం, ఈ మొగుడూ - - ఈ కాపరం... ఇష్! ఏనుగు తలనొప్పి.... పోనీ లక్ష్మిలో సినిమాకి వెళ్ళడమా? డాబా మీద పక్కింటి విమలలా మొగుడితో కబుర్లుచెబుతూ కూర్చోడమా? కాఫీ... టీయా... కోకోయా.... ఏదైనా తలనొప్పి తగ్గించును. తలనొప్పిగా యున్నప్పుడు వేసిన పెసరట్ లేదా రాసిన ప్రేమకథ తలనొప్పిని కలిగించును. కనుక తలనొప్పితో స్వెట్టరు అల్లక సీరియల్ నవల రాయక మీతో వెన్నెట్లో షికారు మంచిదా -

భార్యా భర్తలకు, అయినవారికీ షికారు కారు చవుక. ఒంటికి మంచిది. ఈ పాటికి కమలేం చేస్తూవుంటుంది? వంటింట్లో పొయ్యిముందు చదువుతున్న సీరియలున్న పత్రికని పంచదార డబ్బామీద మూత పెట్టి అది కారుషెడ్డులో కాపురమున్న కామేశ్వరికి కనిపించకుండా